కూకట్‌పల్లి జడ్సీగా అపూర్వ్ చౌహాన్ బాధ్యతల స్వీకరణ

కూకట్‌పల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ (జడ్సీ)గా నియమితులైన ఐఏఎస్ అధికారి అపూర్వ్ చౌహాన్ మంగళవారం మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జోగులాంబ గద్వాల్ జిల్లాకు అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన కూకట్‌పల్లి జెడ్సీగా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే.. ఈ సందర్భంగా జోనల్ కార్యాలయానికి మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్లకు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది జోనల్ కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

కూకట్‌పల్లి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ డీసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీసీపీ సురేష్‌కుమార్ మంగళవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, గస్తీ నిర్వహణ, కేసుల నమోదు, కేసుల పెండింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు శాంతిభద్రతలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకొంటామని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, డీఐ వెంకటేష్, అడ్మిన్ ఎస్సై రామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

పిల్లలు లేని ప్రదేశంలో కుక్కలకు ఆహారం ఇవ్వాలి


వీధి కుక్కలను పడుతున్న సిబ్బంది

దుండిగల్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఆహారం, నీళ్లలేక వీధికుక్కలు వింతగా ప్రవర్తిస్తున్నాయని, చిన్న పిల్లలు లేని ప్రదేశంలో కుక్కలకు ఆహారం, తాగునీరు అందించాలని దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. మల్లంపేట్‌లోని వీధికుక్కలతో బాధపడుతున్న కాలనీవాసుల రక్షణ కొరకు బ్లూక్రాస్ సొసైటీ భాగస్వామ్యంతో మంగళవారం 18 కుక్కలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వీధి కుక్కలకు బ్లూ క్రాస్ సొసైటీ వారు తీసుకెళ్లి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేసి, యాంటీ రేబిస్ టీకా వేసి వదిలిపెడతారన్నారు. కార్యక్రమంలో బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు, మున్సిపల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సత్యనారా యణ

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపి ఇబ్బందులు పడొద్దని అల్వాల్ ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ తెలిపారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంపల్లిలో మంగళవారం రాంగ్‌రూట్, నంబర్‌ప్లేట్ లేని ద్విచక్ర వాహనదారులకు సీఐ, ఎస్‌ఐలు కౌన్సెలింగ్ చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, ప్రయాణం చేయాలని, రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేసి, ఇతరులకు ఇబ్బందులు కలిగించి, ఇబ్బందులు పడొద్దన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. 22 వాహనాలకు నెంబరు ప్లేట్లు బిగించి, జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు ప్రశాంత్‌రెడ్డి, శ్యామ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ ఐటీ ప్రొఫెషనల్స్ ఆత్మీయ సమావేశం 30న

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ ఐటీ ప్రొఫెషనల్స్ ఆత్మీయ సమావేశాన్ని ఈనెల 30న కేపీహెచ్‌బీలో నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపకులు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్‌బీ మూడోఫేజ్ వాసవీ కన్యకాపరమేశ్వరి టెంపుల్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తత్వం చారిటబుల్ ట్రస్ట్ అధినేత బ్రహ్మశ్రీ బంగారయ్య, గౌరవ అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రత్యేక అతిథులుగా సినీనటుడు ప్రదీప్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. బ్రాహ్మణ ఐటీ ఉద్యోగులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీకృష్ణయూత్ చేస్తున్న సేవలు అభినందనీయం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణయూత్ సేవలు అభినందనీయమని కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం శ్రీకృష్ణయూత్/ జగదీష్ యువ సంఘటన ఆధ్వర్యంలో హఫీజ్‌పేట ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చిందని జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. మమత హాస్పటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి హాజరైన వారిలో 100 మందికి శస్త్రచికిత్సలు, 28 మంది గర్భిణులకు డెలివరీ ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు.

దోమల నివారణకు ఎంఎల్ఓ ఆయిల్ బాల్స్


చెరువులో ఆయిల్‌బాల్స్ వేస్తున్న నరసింహులు, సిబ్బంది

హైదర్‌నగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్‌చెరువులో ఎంటమాలజీ సిబ్బంది దోమల నివారణ మందులు మంగళవారం వేశారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు, సిబ్బందితో కలిసి దోమల లార్వాను అంతం చేసేందుకు ఎంఎల్ఓ ఆయిల్‌బాల్స్ చెరువులో వేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల గుడ్ల ఉత్పత్తి అయ్యే ప్రాంతాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాసకాలనీ దనెక్స్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ట్రెజరర్ ధర్మారెడ్డి, బ్రహ్మయ్య, స్థానికులు గోపాల్‌రాజు, సాంబశివరావు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

హైదర్‌నగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎన్టీఆర్‌నగర్ కాలనీలో సీసీ రోడ్లు, విద్యుత్ సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌కు వివరించారు. మంగళవారం కాలనీలో కార్పొరేటర్ పర్యటించి సమస్యలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌నగర్‌లో పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్ల కోసం అంచనాలు వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా విద్యుత్ సమస్యలు కూడా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో పారిశుధ్య సమస్య ఎక్కువగా చెత్తను రోడ్లపై వేయకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, సీహెచ్ భాస్కర్, ఫారూఖ్, ఖలీమ్, ఆదర్శ్, అగ్రవాసు, జానయ్య, జీహెచ్‌ఎంసీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్, రవీందర్‌రెడ్డి, ఎంటమాలజీ సూపర్‌వైజర్ శివ, ఎస్ఎఫ్ఏ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

● ప్రమాదకరం




అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్, గాయత్రి నగర్ కూడలిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు తీగలు కిందకు వేలాడుతున్నాయి. పైగా వీధి మలుపులో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్‌ల కారణంగా నిత్యం ట్రాఫిక్ జాం అవుతుండడంతో వాటిని తొలగించాలన్న డిమాండ్ వస్తోంది.


శోభనా బస్టాపు వైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న బాలానగర్ ప్రజలు


డివైడర్ నిర్మాణం కోసం తవ్వకాలు చేపడుతున్న సిబ్బంది

రోడ్డు దాటలేక పోతున్నాం

● ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి ● బాలానగర్ ప్రజల వినతి

బాలానగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): శోభనాకాలనీ బస్టాపు వైపునకు వెళ్లడానికి రోడ్డు దాటేందుకు బాలానగర్ ప్రజలు జంకుతున్నారు. బాలానగర్ ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చిన తరువాత ఏర్పాటు చేసిన ఐరన్ డివైడర్ల కారణంగా రోడ్డు దాటే పరిస్థితి లేదు. దీంతో హరిజనబస్తీ సిగ్నల్ వరకు నడుచుకుంటూ వెళ్లి రోడ్డు దాటి శోభన బస్టాపు వరకు వస్తున్నారు. వృద్ధులు, పిల్లలు దూరం నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. దీని వలన సమయం వృథా కావడంతో పాటు ట్రాఫిక్ రద్దీ సమయంలో రోడ్డు దాటడం ప్రమాదకరంగా ఉంది. రోడ్డు దాటే క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడిన ఘటనలూ చోటుచేసుకున్నాయి. బాలానగర్ డివిజన్ పరిధిలోని సుమారు 10 బస్తీలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగులు కూకట్‌పల్లి వైపునకు, వై జంక్షన్ వద్ద ఉన్న మెట్రోస్టేషన్, ఫతేనగర్ ఎంఎంటీఎస్ స్టేషన్, బీహెచ్‌ఈఎల్, పఠాన్‌చెరు, నిజాంపేట, కూకట్‌పల్లి తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఈ బస్టాపు వద్దకే రావాల్సిన పరిస్థితి ఉంది. ప్రజల అవస్థలను గమనించిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి బాలానగర్ బ్రిడ్జి సమీపంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కొద్దిరోజుల క్రితం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇవేమి పట్టనట్లు అధికారులు సోమవారం నుంచి ఐరన్ డివైడర్లు తొలగించి సిమెంటు గోడతో శాశ్వత డివైడర్ల నిర్మాణం పనులు మొదలు పెట్టారు. ఈ ప్రాంతంలో ప్రజలు రోడ్డు దాటే వీలుగా సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు పులి శివకుమార్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సదానందం, దండు రవి అధికారులను కోరుతున్నాడు. అయినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సిగ్నల్స్ ఏర్పాటు చేయండి



ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా అధికారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. శోభనా బస్టాపు వద్దకు వెళ్లాలంటే రోడ్డు దాటేందుకు ప్రజలు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటూ వెళ్తున్నారు. శోభనా బస్టాపు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రజలు ప్రశాంతంగా ప్రయాణం చేస్తారు.

\- పులి శివకుమార్‌గౌడ్, బాలానగర్

పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు


తేజేష్‌ను అభినందిస్తున్న ఏసీపీ హనుమంతరావు, సీఐ నవీన్‌కుమార్

బాలానగర్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఏమి లేదని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సీఐ నవీన్‌కుమార్ అన్నారు. జూన్ 13 నుంచి 17 వరకు ఒషియానియా, పసిఫిక్ చాంపియన్‌షిప్ పోటీలలో ఇన్‌లైన్ స్కేటింగ్‌లో బంగారుపతకం, సోలోడాన్స్‌లో వెండి పతకం, ఫ్రీస్కేటింగ్‌లో కాంస్య పతకం సాధించిన సందర్భంగా తేజేష్ పడిగ బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సీఐ నవీన్‌కుమార్ తేజేష్‌ను అభినందించారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

బాలానగర్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను, గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. మంగళవారం ఉదయం బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్‌లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముందు ఆ సమస్యను పరిష్కరించాలని అధికారులకు వివరించారు.

సమస్యలను పరిశీలించిన కార్పొరేటర్ రోజాదేవి

వివేకానందనగర్‌కాలనీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని పటేల్‌కుంట పార్కులో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మంగళవారం పరిశీలించారు. పార్కులో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఓపెన్ పరికరాలకు మరమ్మతులు, టాయిలెట్స్ నిర్వహణ, వాకింగ్ ట్రాక్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హెచ్‌ఎండీఏ డీఈ జగన్, ఏఈ సంధ్య, పార్కు సభ్యులు చెన్నయ్య, కొండయ్య, రామచంద్రయ్య, హనుమంతరావు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్‌తో హాస్టల్ విద్యార్థినులకు అస్వస్థత

చందానగర్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): చందానగర్‌లోని సుమన్ మహిళ దక్షిత సమితి కళాశాల విద్యార్థినిలు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి భోజనం చేసిన విద్యార్థినులు మంగళవారం ఉదయం అస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడ్డారు. దీంతో నిర్వాహకులు 24 మంది విద్యార్థినులను స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో 14 మందిని డిశ్చార్జ్ కాగా మిగతా వారు చికిత్స పొందుతున్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణ, సభ్యులు

సహజ యోగా మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

చందానగర్, జూన్ 25(ఆంధ్రజ్యోతి): సహజ యోగా మహోత్సవ బ్రోచర్‌ను చందానగర్‌లో మంగళవారం సహజయోగ సభ్యులు ఆవిష్కరించారు. సహజయోగ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కృష్ణ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై సభ్యులతో కలిసి పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతాజీ నిర్మాలదేవి స్థాపించిన సహజయోగ నేడు సుమారు 170 దేశాల్లో శాఖలు స్థాపించబడ్డాయన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 28 సాయంత్రం 7 గంటలకు, 29న నిజాం కళాశాల గ్రౌండ్, 30న చందానగర్ పీజేఆర్ స్టేడియంలో సాయత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. విదేశాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కో-ఆర్డినేటర్ కృష్ణ, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సుప్రజ, ప్రవీణ్, కరణ్ తదితరులు ఉన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



జీడిమెట్ల, జూన్ 25(ఆంధ్రజ్యోతి): మనువడి పెళ్లికి వచ్చిన వృద్ధురాలు అదృశ్యమైంది. నిజాంబాద్ జిల్లా, నిజాంసాగర్ మండలం, అచ్చులంపేట్‌కు చెందిన చంద్రయ్య భార్య ఎం.దుర్గవ్వ(75) ఈనెల 24వ తేదీన రోడామిస్త్రీనగర్ ప్రాంతంలోని వల్లభాయ్‌పటేల్‌నగర్‌లో తన మనవడి పెండ్లికి హాజరయింది. 24వ తేది రాత్రి 11 గంటల సమయంలో అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జాలరులను బెదిరించి డబ్బులు లాక్కున్న రౌడీషీటర్

నార్సింగ్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): చెరువులో చేపలు పట్టుకుంటున్న జాలరును బెదిరించిన ఓ రౌడీషీటర్ వారి వద్ద నగదు లాక్కున్నాడు. నార్సింగ్ పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదైన ఇర్ఫాన్ సోమవారం రాత్రి స్నేహితులతో కలిసి పీరంచెరువు కట్టపై మద్యం తాగాడు. అదే సమయంలో చెరువులో చేపల వేటకోసం వలలు వేసేందుకు వచ్చిన ఉప్పర్‌పల్లికి చెందిన సందీప్‌కుమార్ అతని సహచరుల వద్దకు ఇర్ఫాన్ ఇతని మనుషులు వెళ్లారు. 'ఇప్పటికే అనేక మర్డర్లు చేశాను. వారం రోజుల క్రితమే జైలు నుంచి వచ్చాను. మిమ్మల్ని చంపి మళ్లీ జైల్‌కు పోతాను' అంటూ ఇర్ఫాన్ కత్తితీసి జాలర్ల ముందు తిప్పడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. జేబులో ఎంత ఉంటే అన్ని డబ్బులు ఇవ్వాలని ఇర్ఫాన్ డిమాండ్ చేయడంతో సందీప్‌కుమార్ జేబులో ఉన్న రూ.11 వేలు ఇర్ఫాన్‌కు ఇచ్చేసి అక్కడి నుంచి పారిపోయారు. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వెళ్లి వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. గతంలో పీరంచెరువు వద్ద డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు జరుగుతున్న సమయంలో ఈ ఇర్ఫాన్ ద్విచక్ర వాహనాన్ని కాల్చేసి హంగామా సృష్టించాడు. ఈ కేసులో నార్సింగ్ పోలీసులు ఇతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు. రౌడీషీటర్ ఇర్ఫాన్ కోసం నార్సింగ్ పోలీసులు గాలిస్తున్నారు.

20 రోజుల్లో 60 సెల్‌ఫోన్లు రికవరీ

బాధితులకు అందజేసిన డీసీపీ నరసింహ


సెల్‌ఫోన్‌లు దొరకడంతో డీసీపీ, ఐటీసెల్ పోలీసులకు కృతజ్ఞతలు తెలుపుతున్న బాధితులు

హైదరాబాద్‌సిటీ, జూన్25(ఆంధ్రజ్యోతి): ఇటీవల చోరీకి గురైన మొబైల్స్‌లో కొన్ని మొబైల్స్‌ను సైబరాబాద్ ఐటీ సెల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేవలం 20 రోజుల్లోనే 60 ఫోన్‌లు రికవరీ చేసినట్లు సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నరసింహ మంగళవారం తెలిపారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు డీసీపీ ఫోన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ చోరీలను, నకిలీ మొబైల్ పరికరాలను అరికట్టడానికి టెలీకమ్యూనికేషన్ విభాగం గతేడాది మే-17న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. మొబైల్స్ చోరీకి గురైన వెంటనే పోలీసులను సంప్రదించి సీఐఆర్ పోర్టల్‌తో నమోదు చేస్తే టెలీకమ్యూనికేషన్ సహకారంతో తిరిగి రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా బాధితులు ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ఫిర్యాదు చేయడంతో పాటు.. నేషనల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

మియాపూర్ భూములను పరిశీలించిన రంగారెడ్డి కలెక్టర్

మరో 21 మంది అరెస్టు.. ఇప్పటి వరకు 52 మంది అరెస్టు


ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

మియాపూర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. మంగళవారం రెవెన్యూ హుడా అధికారులతో కలిసి ఇటీవల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసిన సంఘటనలో పోలీసులు, పేదలకు ఘర్షణ జరిగిన భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ, హుడా అధికారులను సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ భూములను కాపాడాలని ఆదేశించారు.

● 21మంది అరెస్టు రిమాండ్

మియాపూర్ ప్రభుత్వ భూముల విషయం లో అధికారులను అడ్డుకోవడమే కాకుండా వారిపై రాళ్లు రువ్విన వారిని మంగళవారం మరో 21 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇప్పటి వరకు 52 మందిని అరెస్టు చేసి రామలింగదుర్గప్రసాద్ తెలిపారు.

శిఖర స్కూల్‌లో ఏడాది పాటు నైన్త్ క్లాస్ రద్దు: సీబీఎస్ఈ

హైదరాబాద్ సిటీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా దుండిగల్-గండి మైసమ్మ మండలంలోని బౌరంపేటలో ఉన్న 'శిఖర స్కూల్ (ఇంటి నెంబర్ 6-7/5/4)'లోని తొమ్మిదో తరగతిని ఏడాది పాటు సస్పెండ్ (రద్దు) చేస్తున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) రీజినల్ ఆఫీసర్ శేఖర్‌చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ అఫిలియేషన్ కోసం దరఖాస్తు (అప్లికేషన్ నెంబర్ 90828-2324) చేసిన సందర్భంలో ఆ స్కూలు యాజమాన్యం.. తమ పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకే విద్యార్థులు చదువుతున్నట్లు సమాచారమిచ్చిందని వివరించారు. కానీ.. ఆ ఎనిమిదో తరగతి పిల్లలను తొమ్మిది, పదో తరగతులకు ప్రమోట్ చేసిన వివరాలను తమకు వెల్లడించలేదని తెలిపారు. నిజానికి 1.4.2023 నుంచి తొమ్మిదో తరగతిని ప్రారంభించడానికి 2023 సంవత్సరం జూన్ 25న ప్రత్యేక షరతులతో సీబీఎస్ఈ అఫిలియేషన్‌ను మంజూరు చేశామని పేర్కొన్నారు. ఆ తొమ్మిదిలో ఉత్తీర్ణులైనవారిని 1.4.2024 నుంచి పదో తరగతికి ప్రమోట్ చేసేలా అనుమతి ఇచ్చామన్నారు. కానీ.. స్కూలు యాజమాన్యం ఈ నిబంధనలను పాటించకుండా తొమ్మిది, పదో తరగతులకు విద్యార్థులను ప్రమోట్ చేశారని తెలిపారు. ఈ దృష్ట్యా 1.4.2024 నుంచి ప్రారంభమైన అకడమిక్ సెషన్‌లో తొమ్మిదో తరగతిలో విద్యార్థులను చేర్చుకోవద్దంటూ ఇప్పటికే ఆదేశించామని వివరించారు.


మాల్‌లో డీబీ టీమ్‌తో తనిఖీలు చేస్తున్న కేపీహెచ్‌బీ పోలీసులు

భద్రతపై నెక్సస్ మాల్‌లో మాక్‌డ్రిల్

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ బీడీ (బాంబ్ డిస్పోసల్) టీమ్‌తో సీఐ వెంకటేశ్వరరావు మంగళవారం సాయంత్రం నెక్సస్ మాల్‌లో భద్రతపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాల్ ప్రవేశం దగ్గర నుంచి పార్కింగ్ ప్రదేశాలతో పాటు జనం ఎక్కువగా ఉండే ఎస్కలేటర్లు, షాపింగ్ సెంటర్ల వద్ద తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. డాగ్‌తో వచ్చి పోలీసులు తనిఖీలు చేయడంతో అక్కడ ఏం జరుగుతోందో అర్థంకాక కస్టమర్లు భయంభయంగా చూశారు. మాక్‌డ్రిల్ అని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాల్‌లో భద్రతపై అక్కడి సిబ్బందికి సూచనలు చేశామన్నారు. అనుకోకుండా ఏదైనా ప్రమాదం ఉందని తెలిసినప్పుడు ప్రజలను సురక్షితంగా మాల్ నుంచి ఎలా రక్షించాలనే దానిపై మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించామన్నారు.

హెచ్ఏఎల్ కాలనీలో చైన్‌స్నాచింగ్

జీడిమెట్ల, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని హెచ్ఏఎల్ కాలనీలో పట్టపగలే చైన్‌స్నాచింగ్ జరిగింది. బాధితురాలు అరవడంతో నిందితుడు పారిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్ఏఎల్‌కాలనీకి చెందిన వెంకటేశ్‌చారి భార్య శ్రీవల్లి(18) మంగళవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. బైక్‌పై ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని పుస్తెల తాడును గట్టిగా లాగాడు. పుస్తెలతాడు తెగిపోయి మూడు ముక్కలై కిందపడ్డాయి. బాధితురాలు అరవడంతో నిందితుడు పారిపోయాడు. శ్రీవల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

సాయంత్రం 5.45 గంటలకు ఉషోదయకాలనీలో..


గుడికి వెళ్లి ఇంటికి నడుచుకుంటూ వస్తున్న ఓ మహిళ మెడలోని మూడు తులాల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించుకు పారిపోయాడు. ఈ సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉషోదయా కాలనీలో మంగళవారం సాయంత్రం 5.45 నిమిషాలకు జరిగింది. కాలనీకి చెందిన శివజ్యోతి(54) వెంకటేశ్వస్వామి ఆలయానికి వెళ్లి నడుచుకుంటూ ఇంటికి వస్తోంది. ఎదురుగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. ఆగంతకుడు నల్లరంగు పల్సర్‌బైక్, వెనుకపక్క ఎరుపురంగు సీటు క్యారియర్ ఉన్నట్టు గుర్తించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలానగర్ సీఐఈఎల్ చైర్మన్‌పై అనర్హత వేటు


భరత్‌వీర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న సొసైటీ డైరెక్టర్లు, సభ్యులు

బాలానగర్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ కో ఆపరేటివ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్ లిమిటెడ్ (సీఐఈఎల్) ఇన్‌చార్జి చైర్మన్‌గా కొత్తూరు భరత్‌వీర్ (వైస్ చైర్మన్) బాధ్యతలు మంగళవారం చేపట్టారు. ఇంతకు ముందు చైర్మన్‌గా విధులు నిర్వహించిన సయ్యద్ బద్రొద్దీన్‌పై జిల్లా కో ఆపరేటి అధికారులు అనర్హత వేటు వేయడంతో ఆయన స్థానంలో భరత్‌వీర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 20 ఏళ్ల తరువాత హైకోర్టు ఆదేశాలతో మార్చి 30/2022న జిల్లా కో ఆపరేటివ్ అధికారుల పర్యవేక్షణలో సొసైటీకి ఎన్నికలు జరుగగా, మార్చి 31న చైర్మన్‌గా సయ్యద్ బద్రొద్దీన్, వైస్ చైర్మన్‌గా కొత్తూరు భరత్‌వీర్, కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అనతి కాలంలోనే చైర్మన్ తన బాధ్యతలను విస్మరిస్తూ కో ఆపరేటివ్ యాక్టు 1964 సెక్షన్ 32(3) ప్రకారం సొసైటీకి బోర్డు మీటింగ్‌లు నిర్వహించకపోవడంతో వైస్ చైర్మన్, బోర్డు సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణ జరిపి రెండు నెలల్లో తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కో ఆపరేటివ్ అధికారికి ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం డీసీవో రాజేందర్‌రెడ్డి, చైర్మన్ బద్రొద్దీన్, వైస్ చైర్మన్ భరత్‌వీర్‌కు వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చారు. వివరణను పరిశీలించిన డీసీవో బద్రొద్దీన్ మీటింగ్‌లను నిర్వహించకుండా నిర్లక్ష్యం చేశాడని గుర్తించి చైర్మన్‌ను అనర్హుడిగా ప్రకటించారు. కొత్త చైర్మన్ ఎన్నిక జరిగే వరకూ వైస్ చైర్మన్ భరత్‌వీర్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. భరత్‌వీర్‌ను డైరెక్టర్లు మురళీ, మహేందర్ అగర్వాల్, రజాక్, శ్యాం అగర్వాల్, సలీం, శాంతి, సంపత్‌కుమార్ బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

డాక్యుమెంట్లు, ముఖ్య పత్రాలు లేవు



ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఫైళ్లు, తాళాలు అప్పజెప్పమని ఏవో పట్టాభిని అడిగాను. గత చైర్మన్ బద్రొద్దీన్ అన్ని బీరువాలకు సీలు వేసి ముఖ్యమైన ఫైళ్లు, మీటింగ్‌లకు సంబంధించిన మినిట్స్ బుక్స్ అన్ని తన దగ్గర పెట్టుకున్నాడని ఏవో చెప్పాడు. దీనిపై డీసీవోకు ఫిర్యాదు చేశాను. సీఐఈఎల్‌లోని ఫేజ్-1, ఫేజ్-3లోని ల్యాండ్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా.

\- భరత్‌వీర్